ప్రజలే ప్రభువులు

# ప్రజారాజ్యం

లోక్‌సత్తా 'ఇ' సమాచారపత్రం

సంపుటి : 1
సంచిక : 5
మార్చి1-15,2006

## సమాచార చట్టం బయట పెట్టిన బడా బాబుల బండారం

**తెలుసుకోదగ్గ సమాచారం**

చట్టం ముందు అందరూ సమానవే. ఇది మన రాజ్యాంగంలో వ్రాసుకున్నాము. తప్పు చేసినవారు పేదోడైనా, పెద్దోడైనా శిక్షార్హులే అని మన చట్టాలలో పేర్కొన్నాము. కాని ఈ దేశంలో ఇది ఎక్కడా అమలవటం లేదని, అధికారబలం, అంగబలం, అర్ధబలం ఉన్నవారిని చట్టాలు ఏమిచేయలేకపోతున్నాయన్నది నగ్నసత్యం. మరి ఆ చట్టాలను తయారుచేసేవారే, అమలుపరిచేవారే ఉల్లంఘించినపుడు ఇక ఈ దేశాన్ని ఎవరు రక్షిస్తారన్నది సామాన్యుని ఆవేదన

మనమెవరమైనా టెలిఫోన్‌ను వినియోగించుకున్నప్పుడు టంచన్‌గా బిల్లు కడతాము. కట్టకపోతే ఏమౌతుంది,కట్ అవుతుంది. ఆ తర్వాత మళ్ళీ అపరాధ రుసుముతో బిల్లును వందల్లోనైనా వేలల్లోనైనా చెల్లిస్తేనే తప్ప రీకనెక్షన్ ఉండదు. కాని కొందరు బడాబాబులు నెలనెలా బిల్లుల చెల్లించక వేలల్లో, లక్షల్లో బకాయిపడడం, అయినా వారి ఫోన్లు డిస్‌కనెక్షన్ కాకపోవడం, ఒక ఫోన్ డిస్‌కనెక్ట్ అయి

పనిచేయకపోయినా మరో ఫోన్ పొందడం, తదితర ఎన్నో చిత్ర విచిత్రాలు సమాచార హక్కుచట్టం పుణ్యాన బయటపడ్డాయి. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే బి.ఎస్.ఎన్.ఎల్. కు దాదాపు 10 కోట్ల రూపాయలు బకాయిలు రావాల్సి ఉన్నాయని, చెల్లించాల్సిన వారు సమాజంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నవారని, ఇందుకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో కొందరు ఉద్యోగులే సహకరిస్తున్నారనే వార్తలు పలుమార్లు పత్రికలలో వచ్చిన సందర్భంలో వాస్తవాలు తెల్సుకొనుటకై లోక్‌సత్తా జిల్లాశాఖ డిఫాల్టర్స్ లిస్టు ప్రకటించాలని టెలికం అధికారులకు విజ్ఞప్తి చేసింది, కాని స్పందన లేదు.అక్టోబర్ 12 నుండి సమాచార హక్కు అమలులోకి వచ్చిన నేపథ్యంలో 10 వేలకు మించి బకాయిఉన్నవారి వివరాలు అందించాలని లోక్‌సత్తా జిల్లాశాఖ అక్టోబర్ 28న టెలికం అధికారులకు దరఖాస్తుచేయడం జరిగింది. తమకు సమాచార హక్కు గురించి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని బకాయిదార్ల వివరాలు తమవద్ద అందుబాటులో లేవని జనరల్ మేనేజర్ పేర్కొన్నారు. నెలరోజులు పూర్తయిన సందర్భంలో నవంబర్ 27న బకాయిదార్ల వివరాల గురించి లోక్‌సత్తా టెలికం జి.ఎమ్.కు గుర్తు చేసింది. నవంబర్ 28న జి.ఎమ్. కార్యాలయం నుండి ఒక ఉత్తరం పంపిస్తూ తాము వివరాలు త్వరలో ఇస్తామని, అందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఎవరికీ ఫిర్యాదు చేయవద్దని పేర్కొన్నారు. డిసెంబర్ 15 వరకు కూడా ఎలాంటి స్పందన లేక పోవటంతో బకాయిదార్ల లిస్టు గురించి హైదరాబాద్ లోని సి.జి.ఎమ్.కు లోక్‌సత్తా ను అప్పీలు చేసింది. ఈ నేపథ్యంలో పలుమార్లు గుర్తుచేయగా జనవరి 18న 1125 మంది బకాయిదార్ల వివరాలతో 25 పేజీల జాబితాను లోక్‌సత్తాకు టెలికాం అధికారులు 50/- రూపాయలు ఫీజు తీసుకుని అందజేశారు. వీరి బకాయిలు మొత్తం దాదాపు 3 కోట్లు ఉన్నాయి. ఈ వివరాలను లోక్‌సత్తా పత్రికలకు విడుదల చేసింది. ఆ తర్వాత టెలికం శాఖ బకాయిదార్ల జాబితాను సవరించి, తప్పొప్పులను సరిదిద్ది జనవరి 24న మరో జాబితాను లోక్‌సత్తాకు అందజేసింది. ఆశ్చర్యమేమిటంటే నవంబర్ -05 వరకు 10 వేల1 రూపాయలకు మించి

బకాయిపడ్డవారు 2419 మంది ఉన్నారు. దాదాపు 10 కోట్ల రూపాయలు బకాయిగా ఉన్నాయి. ఈ జాబితా ద్వారా సంస్థాపరమైన అనేక లోపాలతో పాటు, పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి.

బకాయున్న సంస్థల్లో పలు పరిశ్రమలు, ఫిల్లింగ్ స్టేషన్‌లు, క్రషర్‌లు, ఆర్థిక పరిపుష్టి కల్గిన ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి.రాజకీయ నాయకుల బకాయిలు ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. ఎమ్.ఎల్.ఎ మాజీ ఎమ్.ఎల్.ఎ లు, పార్టీల

### బకాయిపడ్డ కొందరి వివరాలు

| | | |
|---|---|---|
| కె. మృత్యుంజయం | మాజీ ఎమ్.ఎల్.ఎ | రూ॥ 19234 |
| ఎ. జగపతిరావు | మాజీఎమ్.ఎల్.ఎ | రూ॥ 10279 |
| పి. సుగుణాకర్‌రావ్ | (రాజకీయ నాయకుడు) | రూ॥ 28427 |
| సి.హెచ్. వెంకటరెడ్డి | ఎమ్.ఎల్.ఎ | రూ॥ 17390 |
| టి. జీవన్‌రెడ్డి | ఎమ్.ఎల్.ఎ | రూ॥ 27509 |
| | | రూ॥ 104330 |
| బి. వెంకటేశ్వర్ | మాజీ ఎమ్.ఎల్.ఎ | రూ॥ 16720 |
| జి. రాంకృష్ణారెడ్డి | మాజీ ఎమ్.ఎల్.ఎ | రూ॥ 16048 |
| ఎమ్. ఓజమ్మ | మాజీఎమ్.ఎల్.ఎ భార్య | రూ॥ 24180 |
| జి. భూమయ్య | మాజీఎమ్ఎల్.ఎ | రూ॥ 11644 |
| జి.ఆర్.దేశాయ్ | మాజీమున్సిపల్ చైర్మన్ | రూ॥ 11133 |
| మెట్టబట్టె | మున్సిపల్ చైర్మన్ | రూ॥ 10961 |

నాయకులు, పార్టీ కార్యాలయాలు, చోటా మోటా నాయకులు ఉన్నారు.పబ్లిక్ టెలిఫోన్ల (ఎస్.టి.డి పి.టి. లు) బకాయిలు కోట్లలో ఉన్నాయి. కనెక్షన్ ఇచ్చే సందర్భంలోనే భారీగా డబ్బులు వసులు చేయటం మూలాన సిబ్బంది బినామీ పేర్లతో, సరియైన చిరునామాలు లేకుండానే మంజూరు చేశారు. ఒక పబ్లిక్ టెలిఫోన్ చేతులుమారి చిరునామా మారి నడుస్తున్నది. సిబ్బందికి ఎంతో కొంత ముట్టచెప్పి డిస్‌కనెక్ట్ కాకుండా చూసుకొంటున్నారు.

సంస్థ అభివృద్ధికి పాటు పడాల్సినవారు, సహాయ సహకారాలు, సలహాలు అందించాల్సిన వారైన టెలికాం అడ్వయిజరీ సభ్యులు వేలల్లో బకాయిపడ్డారు. నెలకు వందలాది ఫోన్‌కాల్స్ ఫ్రీ ఉన్నప్పటికీ అధికార దుర్వినియోగానికి పాల్పడి బకాయిపడటం శోచనీయమైన విషయం.

కలెక్టర్ కార్యాలయం, మండలస్థాయి కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, సబ్‌స్టేషన్‌లు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాలు, పోలీస్ అధికారుల కార్యాలయాలు లక్షలల్లో బకాయిపడిన మొత్తం సొమ్ము కోట్లలో ఉంది. బడ్జెట్ మంజూరీతో ఫోన్ బకాయిలు చెల్లిస్తారన్నది ఒక సమస్యయితే, అసలు అడ్డూ అదుపు లేకుండా, ఎలాంటి నియంత్రణ లేకుండా వాడబడటమనేది మరోసమస్య. వచ్చిందని వాడటంతోనే ఫ్రీగా బకాయిలుసొంత పనులకు లక్షలల్లో పేరుకుపోయాయన్నది అందరికీ తెల్సిందే. ఎంతోమంది బకాయిదార్ల చిరునామాలు సరిగాలేవు. కొంతమంది చెక్కేసినారు. అలాంటి వారి గురించి పట్టించుకున్న వారే లేరు.

సంస్థకు ఇంతమంది బకాయిఉన్న ఉద్యోగ సంఘాలు కాని, ఉన్నతాధికారులు కాని చేపట్టిన చర్యలు ఏమి లేవు. తమ అస్థిత్వానికి ముప్పని తెల్సినా అందరూ మౌనంగా ఉంటున్నారు.

నెలకు లక్షలాధి రూపాయలు ఆదాయం ఉన్న కొంత మంది పెద్దలు కూడా బకాయిపడటం శోచనీయం. అందులో వ్యాపారవేత్తలు, డాక్టర్లు, న్యాయవాదులు, ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు ఉన్నారు.

బకాయిలు చెల్లించడం ద్వారా తాము కనీస విలువలకు కట్టుబడి వున్నామని వీరంతా నిరూపించుకుంటారని ఆశిద్దాం. ✪

**- టి. రాజమౌళి**

## వృద్ధుల అనుభవాలే నేటి తరానికి పాఠాలు

**విశాఖ"స్నేహసంధ్య"లో డా॥జయప్రకాష్**

వయోవృద్ధుల్లో ఉన్న అపారమైన అనుభవం, శక్తి సామర్థ్యాలు యువతకు మార్గదర్శకమని లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. విశాఖపట్నంలో నిర్వహించిన స్నేహసంధ్య వయోవృద్ధుల సంక్షేమ సంఘం రెండో వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ వేళ్లూనుకున్న మన సమాజంలో దిశా నిర్దేశం చేయడంలో పెద్దల పాత్ర ఎనలేనిదన్నారు. వీరిని గౌరవించే మన సంప్రదాయం ప్రపంచదేశాలకే ఆదర్శమని ఆయన అన్నారు. దేశంలో ఏడు కోట్లమంది వృద్ధులు ఉన్నారని, వీరు బతికున్నంత కాలం సమాజానికి సేవ చేయాలని కోరారు. మనదేశంలో ఎందరో అభాగ్యులు వైద్య సేవలందక సతమతమవుతున్నారని, వీరికి చేతనైనంత సహాయం చేయాలని ఆయన వృద్ధులకు పిలుపునిచ్చారు. స్నేహ సంధ్య ఛైర్మన్ పి.వి.జి. కె. మూర్తి, కోశాధికారి ఎం. సుదర్శన స్వామి ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎం. చలమయ్య, కళాభారతి వ్యవస్థాపకుడు, సి.ఎస్.ఎన్. రాజు, ఇంజనీర్ ఎ.ఎస్.ఎన్. ప్రసాద్, ప్రముఖ దాత ఎ.ఎస్.రాజు, తెలుగు భాషావేత్త బి. సూర్యనారాయణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ. ప్రసన్నకుమార్, పాల్గొన్నారు. ✪

# ఉత్తరాంధ్ర లో ప్రజారాజ్య ప్రస్థానం

**డా॥ జయప్రకాష్ పర్యటన విశేషాలు**

*డా॥ జయప్రకాష్ నారాయణ ఉత్తరాంధ్ర పర్యటన ఆద్యంతం ఉత్తేజ భరితంగా సాగింది. వచ్చేమూడు నాలుగేండ్లు ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించాలని ఆయన పిలుపు ఇచ్చిన ప్రతిచోట ప్రతిస్పందన కరతాళధ్వనులతో మార్మోగిపోయింది. కర్తవ్యం గుర్తిస్తున్న యువత భుజం కలపడానికి, గళం విప్పడానికి, కదం త్రొక్కడానికి, చరిత్ర తిరగరాయడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన తీరు మరువలేనిది.*

'ప్రజారాజ్యం' స్థాపించుకుంటామని మరోస్వాతంత్ర్య పోరాటానికి మేము సైతం ఉద్యమానికి సమిధనొక్కటి ఆహుతిస్తామంటూ యువత నినదించినవైనం సభాస్థలి పులకరించడం పెద్దల్ని సైతం కార్యోన్ముఖుల్ని చేసింది. జయప్రకాష్ నారాయణ్‌ను ఆశీర్వదించిన వాళ్ళు కొందరైతే, అన్ని విధాల తమ సహాయసహకారాలు అందిస్తామని అభయమిచ్చిన వారు ఎందరో.

ఈ పర్యటనలో మూడురోజులు జె.పి.ని వెన్నంటివున్న వ్యాసకర్త అనుభవాలకు అక్షరరూపం ఈ చిన్న వ్యాసం. వివరాల్లోకి వెళ్దాం రండి!...

శ్రీకాకుళం జిల్లాలో ఉదయం ప్రారంభమైన యాత్ర ఎల్లంపేట మండల కేంద్రంలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రమశిక్షణాయుతమైన కవాతును మరిపించింది. లోక్‌సత్తాలో గల యూనిఫాం ధరించి దారిపొడవునా నినాదాలిస్తూ సభాస్థలికి తోడ్కొనిపోవడం అక్కడి ప్రజానీకాన్ని ఎంతగానో ఆకర్షించింది.

ఉద్యమస్ఫూర్తిని గుర్తు చేస్తూ మురళి రాసి గానం చేసిన గేయం ఎంతగానో ఆకట్టుకుంది.

మూడునాల్గు మండలాల అభిమానులు, కార్యకర్తలు, యువత వందలాదిగా పాల్గొన్న సభలో జె.పి. గారి ప్రసంగానికి మంత్రముగ్ధులైపోయారు.

వందలాదిమంది ఉద్యమకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. టెక్కలి సభలో మిశ్రమ స్పందన లభించింది. భవిష్యత్ కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామంటూ పాల్గొన్న పురజనులు, అభిమానంతో మాట ఇవ్వడం ఓ మరపురాని ఘట్టం.

బాపూజీ కళామందిరంలో రాత్రి జరిగిన కార్యక్రమంలో చిరస్మరణీయం! అక్కడ చైతన్యం ప్రవహించింది. ఉద్యమం ఉరకలు వేసింది. నాట్యాచార్యులు శ్రీకాంత్ దర్శకత్వంలో ముప్పది పైచిలుకు బాలబాలికలు సమర్పించిన దృశ్యరూపకం సభికుల మనసు దోచుకున్నది. ఆలోచనా తరంగాలు ప్రతి గుండెను ప్రకంపనలకు గురిచేసిందంటే అతిశయోక్తి కాదు! వందేమాతరం శ్రీనివాస్ స్వరబద్ధం చేసిన పాటలకు ప్రదర్శించిన హావభావాలు కళాకారులు సాహిత్యం భావనలో మమేకమైన తీరు అద్భుతం! యం.బి.ఎ. విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటిక ఆలోచనా స్ఫోరకంగా సాగింది. అక్రమాలకు, అన్యాయాలకు స్తబ్ధులైన భరతమాతకు జయప్రకాష్ జాతీయ పతాకాన్నందించడం భవిష్యత్తుకు భరోసాయిస్తూ యువత ప్రతినబూనటం విశేషంగా ఆకర్షించింది. మధురానుభూతిని పదేపదే గుర్తు చేసుకున్న ఈ కార్యక్రమం ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిల్చిపోతుంది. అభినందించి ఆశీర్వదించారు.

ఎమ్.వి.యస్.శాస్త్రి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రోణంకి ఆనందరావు, విష్ణుమూర్తి తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. ఎమ్.బి.ఎ. విద్యార్థులు రెండు రోజుల్లో

సేకరించిన 10,000/- రూపాయలు (100 జనబలం చందా వసూలు) జె.పి.గార్కి అందించి ఉద్యమానికి తమ మద్దతు క్రియాశీలకంగా వుంటుందని నిరూపించారు. జె.పి ఆశయాలకు అనుగుణంగా పాలన అందిస్తామని శపథం చేశారు. శ్రీకాకుళం ప్రథమ పౌరురాలు పద్మావతి ఇతర మండలాల నుండి తరలివచ్చిన వందలాది మంది అభిమానులు జయప్రకాష్‌తో ముఖాముఖి గడిపినందుకు ఎంతగానో సంతోషించారు.

రెండవరోజు ఉదయం శ్రీకాకుళంలో ఓ గురుకుల పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి పాలకొండకు చేరేటప్పటికే ఎండ ఎక్కువైంది. అయినా వందలాదిమంది బారులు తీరి బాలబాలికలు స్వాగతం పలికారు. ఎందరో ప్రముఖులు పాల్గొన్న ఈ సభలో గంటసేపు అనర్గళంగా జె.పి. ప్రసంగం

కొనసాగింది. అనన్యమైన ప్రతిస్పందన లభించింది. ఇక్కడ విశేషం చెప్పుకోవాలి!

9వ తరగతి చదువుతున్న నవోదయ పాఠశాల విద్యార్థినులు ముగ్గురు బయల్దేరడానికి కారెక్కిన జె.పి.ని అడ్డుకున్నారు. వారి సందేహాలకు సమాధానాలు చెప్పాలని పట్టు బట్టారు. కుళ్ళుతున్న వ్యవస్థను కాపాడుకోవడానికి తామేం చేయాలో చెప్పాలన్నారు. సమయం లేనందున ఎక్కువసేపు గడపలేనందున విచారం వ్యక్తం చేసి జె.పి. సముదాయించడంతో వారు సంతృప్తి చెందినట్లు తలూపారు. ఇలాంటి సంఘటన ఒక్కటిచాలు జె.పి. ప్రసంగం చిన్నారుల గుండెల్లో పెను ఆలోచనల్ని రగిలిస్తుందని చెప్పడానికి!!

వీరఘట్టమైతే పేరు సార్థకం చేసుకున్నది. బాణాసంచాతో తమ హర్షాన్ని ప్రకటించుకున్నది. వందలాదిమంది ఎదురొచ్చి బ్యాండుమేళాలతో స్వాగతించి సభాస్థలికి తోడ్కొని పోయిన యువకుల ఉత్సాహం మాటల్లో చెప్పలేం. రేగులపాడు గ్రామ ఉపసర్పంచు గజేంద్ర నాయుడు ప్రతిష్టాత్మకంగా ఈ సభను నిర్వహించారు. ఇతర గ్రామాల ప్రతినిధులు, స్థానిక ఎమ్.పి.పి. పాల్గొని ప్రజారాజ్య ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఆలస్యమైనా విజయనగరం జిల్లాలో ఎంతో ఉత్సాహంతో స్థానిక డాక్టర్లు, ఇతర అభిమానులు పార్వతీపురం, బొబ్బిలిలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొన్నారు. బొబ్బిలిలో జామి భాస్కరరావుగారు పార్వతీపురంలో పి. భానుప్రకాష్‌గారు ఈ సమావేశాలు విజయవంతం కావడానికి కృషి చేశారు. బొబ్బిలిలో రాజారంగారావు గారు సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యమం పట్ల అభిమానం ప్రదర్శించడమే కాదు యథోచిత ఆర్థిక సహాయాన్ని అందించారు.

విజయనగరంలో రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశం, ఆ తరువాత బహిరంగసభ కార్యదర్శి బీశెట్టి ఎ. బాబ్జీ కృషికి గుర్తింపుగా నిలిచిపోతుంది. జిల్లా ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, సహాయకార్యదర్శి భానుప్రకాష్. ఉపాధ్యక్షురాలు రుక్మిణి తదితర కార్యకర్తలు కార్యక్రమాలు విజయవంతం కావడానికి ఎంతో తోడ్పడినారు. పెద్దఎత్తున తరలి వచ్చిన జనాలు జె.పి. ప్రసంగం పూర్తి అయినా కదలలేదంటే ఎంతటి తాదాత్మ్యం చెందారో అర్థం చేసుకోవచ్చు.

సభాకార్యక్రమానికి ముందు 'దేశమంటే మట్టికాదోయ్' నృత్యరూపకం , జానకీరాం అనే ఇంటర్ విద్యార్థి ఆలపించినగేయం అందర్నీ కదిలించింది. కనుమరుగవుతున్న పల్లెతనాన్ని కాపాడుకోవాల్సిన తరుణమాసన్నమైందన్న భావాన్ని ఎంతో హృద్యమంగా జానకీరాం ఆలాపించారు. ఆయనకు ఉజ్వల భవిష్యత్తుంటుందన్న ఆశాభావాన్ని జె.పి. వ్యక్తం చేసి అభినందించారు.

ఫిబ్రవరి 22 ఉదయం కొందరు విశాఖజిల్లా గాజువాకలో విద్యార్థులు, కొందరు పెద్దలు పాల్గొన్న సభలో జె.పి. ప్రసంగించారు. ఆ తరువాత అచ్యుతాపురంలో అంగవైకల్య బృందాన్నుద్దేశించి మాట్లాడినారు. ఆ మాటలు వారి గుండెలకు లేపనం పూసిన అనుభూతి వ్యక్తం అయ్యింది. చేతులు ముడుచుకుపోయిన ఓ యువకుడు కార్యక్రమాన్ని చిత్రీకరించడానికి ఎంతో పెనుగులాడాడు. వీరి నాయకుడు నడవలేని పట్నాయక్ ఎంతో ఆశాజనకంగా ప్రతిస్పందించాడు. తాము కూడా ఉద్యమానికి తోడుగా వుంటామని హామీ ఇచ్చారు. ఇది వారి ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలిచిపోతుంది. అంగవైకల్యం వార్ని బాధించడం లేదని, ఎందులోనూ ఇతరులకు తీసిపోమని కార్యక్రమాన్ని వారే స్వయంగా చిత్రీకరించిన తీరు అబ్బురపరిచింది. తాళ్ళపాలెం గ్రామ పంచాయితీలో ప్రజలతో ముఖాముఖి ఆ పిదప అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కొంత సమయాన్ని గడిపారు.

ఇదంతా ఒక ఎత్తైతే గిరిజన ప్రాంతమైన నర్సీపట్నంలో జరిగిన బహిరంగసభ ఒక ఎత్తుగా నిలుస్తుంది. ఏడెనిమిది మండలాల నుండి వేలాది మంది ఎంతో ఉత్సాహంతో గుమిగూడారు. సమావేశకర్త ఆర్కేప్రసాద్ స్వాగతంతో స్వాతంత్ర్యం కోసం ఆత్మార్పణ చేసిన అల్లూరి సీతారామారాజును స్మరించి, మరో స్వాతంత్ర్య పోరాటానికి శంఖారావం పూరించిన జయప్రకాష్ వెంట మేమంతా నిలుస్తామని ఎలుగెత్తి చాటారు. తదుపరి మాట్లాడిన మండలపరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణ రాజు, ఇతర వక్తలంతా ముక్త కంఠంతో అదే అభిప్రాయం వ్యక్తం చేసి 'ప్రజారాజ్యం' కోసం తాము లోక్‌సత్తా ఉద్యమంలో భాగస్వాములవుతామన్నారు.

జె.పి. ప్రసంగించడానికి లేవగానే సభాప్రాంగణం కరతాళధ్వనులతో స్వాగతించింది. అదో అపూర్వ దృశ్యం! ఉద్విగ్నభరిత హృదయంతో సభను సంభోదిస్తున్న జె.పి. పాతికేళ్ళనాటి ఓ సంఘటన వివరిస్తూ వివశులైపోయారు. సన్నని కన్నీటిపొర, బాధను బిగబట్టినా గొంతులో జీర దాచలేకపోయారు. గుండెలోతుల్లోంచి పెల్లుబికిన మాటలకు తడి అంటుకున్నట్లే ఉంది. సభాస్థలి గంభీరంగా మారిపోయింది. ఎంతో ప్రయత్నం మీదకాని తమాయించుకోలేకపోయారు. మళ్ళీ పూర్వస్థితికి రావడానికి కొన్ని క్షణాలు పట్టింది. నుదుటపట్టిన చమట బిందువులు చేతి రుమాలుతో

తుడుచుకోవడం చూసిన జనం కూడా చలించిపోయారు.

సాటిమనిషి కోసం అహరహం తపించే అరుదైన జె.పి. వ్యక్తిత్వం మరోసారి ఆయన మాటల్లోనే ఆవిష్కారమైంది. “పాతికేళ్ళక్రితం నర్సీపట్నం సబ్‌కలెక్టర్‌గా తొలి అధికార బాధ్యతలు చేపట్టినాను. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుండేవాడిని. ఓ రోజు ఇక్కడి ఆసుపత్రిలో పనిచేసే నిరక్షరాస్యులైన ఆయా ఒకామె నా దగ్గర కొచ్చింది. ఆమె కన్నీళ్ళతో నా కళ్ళమీద బడింది. ఓదార్చి ఏం కావాలని అడిగితే కొడుకును ఓమంచి స్కూలు లో (ఆర్.సి.ఎన్.స్కూల్)చదివించాలని వుంది. కాని అవకాశం లేదు. ఎట్లాగైనా మీరు సీటు ఇప్పించాలని ప్రాధేయపడింది.

“ ఈ దేశంలో పుట్టిన ప్రతిబిడ్డకు ఎదగడానికి సమానావకాశాలు లేకపోవడం, కులం కారణంగా, పేదరికం కారణంగా కొందరి భవిష్యత్తు సమాధికావడం అత్యతం హేయమైంది. ఇంతకన్నా పాపం అంటూ ఇంకోటి వుండదు. ప్రతిఒక్కరికి విద్య, వైద్యం, ఉపాధి అందుబాటులోకి తెచ్చే మంచి రాజకీయం కోసమే ఈ ఉద్యమం” అంటూ ఎవరికైతే వీటి అవసరముందో వారంతా రాజకీయాలకు దూరంగా వుంటున్నారని, అందువల్లే అనర్థాలు జరుగుతున్నాయని సోదాహరణంగా వివరిస్తూ జె.పి. గారి ప్రసంగం గంటకు పైగా కొనసాగింది. రాజకీయాల్ని మనమంతా పట్టించుకుంటే, అవినీతి అక్రమాలకు పాల్పడకుండా ఎన్నికల్లో గెలిస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమేనని అపుడే రాజకీయ సంస్కృతి మారుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయానికి, నాయకత్వానికి కొత్త అర్థం చెప్పి నవతారానికి పిలుపు నిస్తూ ప్రసంగం ముగించారు.

అభిమానులు చుట్టుముట్టారు. ఆటోగ్రాఫులకు, కరచలనాలకు ఎగబడ్డారు. చెక్కు చెదరని చిరునవ్వుతో అందర్నీ సంతృప్తి వరుస్తూ ఆయన ముందుకు సాగుతుంటే ఆప్యాయంగా వీడ్కోలు పలికారు. ఇది ప్రతిచోటా కనబడ్డ దృశ్యమే! మార్పు సాధించి తీరుతామన్న పట్టుదల అందరి ముఖాల్లో ప్రతిఫలించింది.

మధ్యాహ్నం అనకాపల్లి, సాయంత్రం ‘సాయంసంధ్య’ సమావేశాల్లో అదే ఓపిక జె.పి. లో కన్పించింది. విశాఖ కళాభారతిలో బహిరంగ సభ, చివరగా హోటల్ దసపల్లాలో ఆత్మీయ సమావేశం ఇలా ఊపిరి సలపని కార్యక్రమాలతో రోజంతా గడిచింది. అభిమానుల పలకరింపులు పులకింతలయ్యాయి. హార్థికంగా, ఆర్థికంగా మరెవ్వరూ తమకు సాటిరారని చెప్పడానికి అది వేదిక అయ్యింది.

ఇందుకు అహర శ్రమించిన జోనల్ కో- ఆర్డినేటర్ ఎమ్.వి.యస్. రాయ్, ఆయనకు చేదోడుగా వున్న ఎపెక్స్ సభ్యులు బి. ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు ఎంతైనా అభినందనీయులు.

ఉత్తరాంధ్ర పర్యటన ఉద్యమ ప్రస్థానంలో కొత్త ఉత్సాహాన్ని నింపిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ✪

**- భండారి అంకయ్య**

---

*మార్చి 1వ తేదీన హైదరాబాద్‌లోని లోక్‌సత్తా రాష్ట్ర కార్యాలయంలో మిత్ర సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లోక్‌సత్తా నుండి డా॥ జయప్రకాష్ నారాయణ్, డి.వి.వి.ఎస్.వర్మ, బండారు రామ్మోహన్‌రావు, డి.సోమసుందర్, సత్యాన్వేషణ మండలి నుండి పుట్టా సురేంద్రబాబు, జనవిజ్ఞాన వేదిక నుండి వి. లక్ష్మణ్‌రెడ్డి, టి.వి.రావు, మానవవికాస వేదిక నుండి బి. సాంబశివరావు, అశ్లీలతా ప్రతిఘటన వేదిక నుండి ఈదర రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ఈ క్రింది తీర్మానాలను ఆమోదించింది.*

## మిత్రమండలి తీర్మానాలు

1. లోక్‌సత్తా ఆరంభించిన నూతన రాజకీయ సంస్కృతి అన్న విషయంలో యువతకు ప్రజారాజ్యం స్థానిక నాయకత్వ శిక్షణ ఉద్యమాన్ని ఉమ్మడి కార్యక్రమంగా స్వీకరించడానికి నిర్ణయించుకోవడమైనది.
2. మిత్రసంస్థల నుండి అభ్యుదయ కాంక్ష వున్న ఇతర సంస్థల నుండీ రాష్ట్రస్థాయి శిక్షకులుగా వ్యక్తులను సమాయత్తపరచాలని తీర్మానించడమైనది.
3. రాష్ట్రస్థాయి శిక్షణ పొందిన వారు జిల్లా శిక్షణ తరగతుల కార్యచరణలో భాగస్వాములై, శిక్షకులుగా పాల్గొనాలనీ తీర్మానించడమైనది.
4. ఈ నిర్ణయాల ప్రతిని మన పత్రికలలో ‘ఉద్యమ సమాచారం’ అన్న శీర్షికన అతిముఖ్య ప్రకటన పేరున ప్రకటించాలి.
5. జూలై లో పంచాయితీ ఎన్నికలు జరిగే పర్యంతరం అన్ని సంస్థలూ దీనికి తాత్కాలిక ప్రాధాన్యతనిచ్చి శక్తివంచన లేకుండా ఉద్యమించాలి.
6. మన మన దిగువస్థాయి శాఖలకు ఈ తీర్మానాలను అందజేసి వారినీ కార్యోన్ముఖులను చేసే పని చేపట్టాలి.
7. గ్రామాలలో శిక్షణకు యువతను సిద్ధం చేసే పనులు ప్రతి సంస్థా చేపట్టాలి. ✪

# ముందుచూపు



ఓ లాలో ఓలాలా
ఓలాలమో........లాలమ్మ

నిద్దురలేచీ లేవంగానే వాకిలి పిలిచెను ఓలాలా
వాకిలి ఊడ్చీ ముగ్గేస్తుంటే రోకలి పిలచెను ఓలాలా ॥ ఓ లాలో ॥


కుంచెడు వడ్లు దంచుత ఉంటె కుండలు పిలిచెను ఓలాలా
కుండలు తోమీ బోర్లిస్తుంటే కుంపటి పిలిచెను ఓలాలా ॥ ఓ లాలో ॥

కూడూ, కూరా వండుతు ఉంటె కుళాయి పిలిచెను ఓలాలా
కుళాయి నీళ్ళూ మోస్తా ఉంటే కూలికి పిలిచిరి ఓలాలా ॥ ఓలాలో ॥

నడిమి ఎండలో నాట్లేస్తుంటే నడుము పట్టినది ఓలాలా
సాయంత్రానికి ఇంటికి వస్తే చాకిరి తప్పదు ఓలాలా ॥ ఓలాలో ॥

అరవై ఏళ్ళూ మరలా నేనూ గిరగిర తిరిగితి ఓలాలా
ముసలివయసులో ముద్దలేకనే వీధిన బడితిని ఓలాలా ॥ ఓలాలో॥

ముందుచూపు ఇక లేకుంటే మరి ముప్పు తప్పదే ఓలాలా
సంఘం నీడలో, సంఘం తోడుగ చల్లగ ఉండరె ఓలాలా ॥ఓలాలో ॥



# సూక్తులు

1. 21వ శతాబ్దంలో నిరక్షరాస్యుడు అంటే, చదవనూ, రాయనూ రాని వాడు కాదు, నేర్చుకోడానికి ఇష్టపడని వాడే నిజమైన నిరక్షరాస్యుడు. - సిగ్మండ్ ఫ్రాయిడ్
2. లక్ష్యం పెట్టుకోవడం కాదు సాధిస్తేనే సార్థకత -ఇటాలియన్ సామెత
3. పని చేయని వారికి దేవుడు కూడా సాయపడడు - సాఫోక్లిస్
4. సాహిత్యం ఎప్పుడూ భవిష్యత్ జీవితాన్ని చూపిస్తుంది. అది జీవితాన్ని అనుకరించదు. అది జీవిత లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. - ఆస్కార్ వైల్డ్
5. ప్రేమ దీన్ని కావాలనదు, అది ఇచ్చేదే తప్ప పుచ్చుకునేది కాదు - గాంధీజీ
6. బలహీనులే అదృష్టాన్ని నమ్ముతారు. శక్తివంతులెప్పుడూ కార్యకారణ సంబంధాన్నే విశ్వసిస్తారు. - ఎమర్సన్
7. అన్ని చెడ్డలూ కోపం నుంచే జన్మిస్తాయి. ఎవరు ఎంత రెచ్చకొట్టినా క్రోధావేశం పొందరాదు. - తిరువళ్ళువార్
8. పోట్లాటకు దిగడానికి ముందు ఆలోచించు కానీ దిగాక ప్రత్యర్థి ఆలోచించేలా చెయ్యి - షేక్స్పియర్
9. మనిషి కోసం నీతి ఉంది కానీ నీతి కోసం మనిషి లేడు -ఇజ్రాయెల్ జాంగ్విల్
10. ఒక అబద్ధాన్ని కాపాడుకొనడానికి చాలా అబద్ధాలు చెప్పాల్సి ఉంటుంది. - థామస్ ఫుల్లర్

## వివిధ రాష్ట్రాల పంచాయితీరాజ్ సంస్థలు
## వాటి ప్రజాప్రతినిధుల సంఖ్య (ఏప్రిల్1,2004)

**గణాంకదర్శిని**

| క్రమ సంఖ్య | రాష్ట్రం / కేంద్రపాలిత ప్రాంతం పేరు | గ్రామ పంచాయతీ | తాలూకా పంచాయతీ | జిల్లా పంచాయతీ | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1 | ఆంధ్రప్రదేశ్ | 21913 | 1095 | 22 | 23030 |
| 2 | అరుణాచల్ ప్రదేశ్ | 1747 | 150 | 15 | 1912 |
| 3 | అస్సాం | 2489 | 203 | 20 | 2712 |
| 4 | బీహార్ | 8471 | 531 | 38 | 9040 |
| 5 | ఛత్తీస్‌గర్ | 9139 | 146 | 16 | 9301 |
| 6 | గోవా | 190 | 0 | 2 | 192 |
| 7 | గుజరాత్ | 13819 | 225 | 25 | 14069 |
| 8 | హర్యానా | 6034 | 114 | 19 | 6167 |
| 9 | హిమాచల్ ప్రదేశ్ | | 75 | 12 | 3124 |
| 10 | జార్ఖండ్ | 3746 | 211 | 22 | 3979 |
| 11 | జమ్ము కాశ్మీర్ | 2683 | 0 | 0 | 2683 |
| 12 | కర్నాటక | 5659 | 175 | 27 | 5861 |
| 13 | కేరళ | 991 | 152 | 14 | 1157 |
| 14 | మధ్యప్రదేశ్ | 22029 | 313 | 45 | 22387 |
| 15 | మహారాష్ట్ర | 28553 | 349 | 33 | 28935 |
| 16 | మణిపూర్ | 166 | 0 | 4 | 170 |
| 17 | మేఘాలయ* | 0 | 0 | 0 | 0 |
| 18 | మిజోరం* | 0 | 0 | 0 | 0 |
| 19 | నాగాలాండ్* | 0 | 0 | 0 | 0 |
| 20 | ఒరిస్సా | 6234 | 314 | 30 | 6578 |
| 21 | పంజాబు | 12445 | 140 | 17 | 12602 |
| 22 | రాజస్థాన్ | 9189 | 237 | 32 | 9458 |
| 23 | సిక్కిం | 159 | 0 | 4 | 163 |
| 24 | తమిళనాడు | 12168 | 385 | 29 | 13032 |
| 25 | త్రిపుర | 537 | 23 | 4 | 564 |
| 26 | ఉత్తరప్రదేశ్ | 52028 | 813 | 71 | 52912 |
| 27 | ఉత్తరాంచల్ | 7227 | 95 | 13 | 7335 |
| 28 | పశ్చిమబెంగాల్ | 3360 | 333 | 18 | 3711 |
| 29 | అండమాన్ & నికోబార్ దీవులు | 67 | 7 | 1 | 75 |
| 30 | చండీఘర్ | 17 | 1 | 1 | 19 |
| 31 | దాద్రా & నాగర్ హవేలి | 11 | 0 | 1 | 12 |
| 32 | దామన్ & డీవ్ | 10 | 0 | 1 | 11 |
| 33 | ఎన్.సి.టి. ఆఫ్ ఢిల్లీ # | 0 | 0 | 0 | 0 |
| 34 | లక్షద్వీప్ | 10 | 0 | 1 | 11 |
| 35 | పాండిచ్చేరి | 98 | 10 | 0 | 108 |
| | **మొత్తం** | **234676** | **6097** | **537** | **241310** |

* = సాంప్రదాయక మండళ్లు                # = పంచాయితీ రాజ్ వ్యవస్థ ఇంకా నిర్మాణం జరగలేదు